పాలకొల్లులో భారీ వర్షం

ప్రజాశక్తి - పాలకొల్లు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో పాలకొల్లులో సోమవారం ఉదయం భారీ వర్షం పడింది. దీంతో జనజీవనం స్తంభించింది. కనీసం పాల ప్యాకెట్లు, కనీస అవసరాలు తీర్చుకునేందుకు అవకాశం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు తమ స్థానాలకు వెళ్లేందుకు ఇక్కట్లు పడ్డారు. అలాగే పట్టణంలోని రోడ్లు, డ్రెయినేజీలు ఏకమయ్యాయి. బస్టాండ్‌తో పాటు పలు ప్రాంతాలు చెరువుల్లా మారాయి.

రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

ఎక్కడికక్కడ అరెస్టులు..

అంగన్‌వాడీల చలో విజయవాడపై పోలీసుల ఉక్కుపాదం
200 మందిని పోలీస్ స్టేషన్లకు తరలింపు, విడుదల
జిల్లాలో పెల్లుబికిన నిరసనలు

పాలకొల్లు పోలీస్‌స్టేషన్ వద్ద నిర్బంధంలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో అంగన్‌వాడీలను అడుగడుగునా పోలీసులు అడ్డుకున్నారు. విజయవాడ మహాధర్నాపై ప్రభుత్వం నిర్బంధాన్ని విధించింది. జిల్లా అంతటా అంగన్‌వాడీలను ఎక్కడికక్కడే అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. దీంతో జిల్లాలో నిరసనలు పెల్లుబుకాయి. అంగన్‌వాడీల అక్రమ అరెస్టులను సిపిఎం, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘాలు ఖండించాయి.

ఐసిడిఎస్ పరిరక్షణ కోసం, అంగన్‌వాడీలకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, పెన్షన్, పిఎఫ్, ఇఎస్‌ఐ, గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, ఇతర పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) చేపట్టిన విజయవాడ మహాధర్నాపై ప్రభుత్వం నిర్బంధాన్ని విధించింది. విజయవాడ ధర్నాకు వెళ్లకుండా అడ్డంకులు సృష్టించింది. జిల్లాలో కనిపించిన అంగన్‌వాడీలను ఎక్కడికక్కడ పోలీసులు అరెస్టు చేసి పలు పోలీస్‌స్టేషన్లకు తరలించారు. సిఐటియు నేతలు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు, వివిధ అంగన్‌వాడీ టీచర్లకు సైతం పోలీసులు ముందస్తు నోటీసులు జారీచేసి కొంతమందిని గృహ నిర్బంధం చేశారు. విజయవాడ తరలివెళ్తున్న అంగన్‌వాడీలు, యూనియన్ నేతలను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఆకివీడులో 15 మందిని, పాలకొల్లులో 20 మందిని, తాడేపల్లిగూడెంలో 20 మందిని, నరసాపురంలో 20 మందిని, భీమవరంలో 15 మందిని, భీమవరం రూరల్‌లో 20 మందిని సుమారు 200 మంది అంగన్‌వాడీలను పోలీసులు అరెస్టు చేశారు. వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించి నిర్బంధించిన అనంతరం వదిలిపెట్టారు. పెనుమంట్రలో అంగన్‌వాడీలను అరెస్ట్‌చేసి ఏలూరు జిల్లా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో నిరసనలు పెల్లుబుకాయి. ఆయా పోలీస్ స్టేషన్ల వద్ద అంగన్‌వాడీలు, యూనియన్ నేతలు నిరసనలకు దిగారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తుంటే ప్రభుత్వం పోలీసులను ఉపయోగించి నిర్బంధించి అరెస్టులకు పాల్పడటం అన్యాయమని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం, ఆకివీడు, పాలకొల్లు పోలీస్ స్టేషన్ల ప్రధాన పట్టణ ప్రాంతాల్లో అంగన్‌వాడీలు ధర్నాలు నిర్వహించారు. ప్రభుత్వ విధానాలు, అక్రమ అరెస్టులు, నిర్బంధాలపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్‌వాడీలకు సిపిఎం, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం మద్దతు ప్రకటించి అక్రమ అరెస్టులను ఖండించారు.

విజయవాడ తరలివెళ్లిన 2 వేల మంది అంగన్‌వాడీలు

విజయవాడ మహాధర్నాకు జిల్లా నుండి 2 వేల మంది అంగన్‌వాడీలు తరలివెళ్లారు. ధర్నా ఉన్న నేపథ్యంలో రెండు రోజుల ముందే అంగన్‌వాడీలు విజయవాడకు చేరుకున్నారు. అయితే పోలీసులు జిల్లా నుంచి వెళ్లిన అంగన్‌వాడీలను అడ్డుకున్నారు. అరెస్టులు చేసి విజయవాడలో నాలుగు పోలీస్ స్టేషన్లకు సుమారు 500 మందిని తరలించారు. అయితే అడ్డంకులు, నిర్బంధాలు, అరెస్టులు ఎదుర్కొని సుమారు 1500 మంది ధర్నాలో పాల్గొన్నారు. సిఐటియు నేతలు, యూనియన్ నాయకులు 300 మంది అంగన్‌వాడీలకు ముందస్తు నోటీసులు జారీ చేశారు.

భీమవరం : ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడమే గాక వారిని నిర్బంధిస్తారా అని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి, సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చలో విజయవాడ ధర్నాకు వెళ్తున్న అంగన్‌వాడీ టీచర్లను, ఆయాలను పోలీసుల అక్రమ అరెస్టులు, ప్రభుత్వ నిర్బంధాన్ని ఖండిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో టూ టౌన్ పోలీస్‌స్టేషన్, అంబేద్కర్ సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలన్, కళ్యాణి, ఎఐటియుసి నాయకులు ఎం.సీతారాంప్రసాద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ నాయకులు బి.వాసుదేవరావు, వైకుంఠరావు, సావిత్రి, రాజేశ్వరి, మాధవి, నాగరత్నం, పద్మ, ధనలక్ష్మి, ఎల్‌ఎస్.కుమారి పాల్గొన్నారు. జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని అడిగేందుకు విజయవాడ వెళుతున్న అంగన్‌వాడీలను అక్రమంగా అరెస్టులు చేయడాన్ని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ ఖండించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

నరసాపురం టౌన్ : అంగన్‌వాడీలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ సెంటర్లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ మాట్లాడారు. అంగన్‌వాడీల హామీలను పరిష్కరించకపోగా వారు చేస్తున్న పోరాటాలను అణచివేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకే సిగ్గుచేటు అని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి పొన్నాడ రాము, యూనియన్ నాయకులు జి.రాజేశ్వరి, జోగి శ్రీలక్ష్మి, పివిఎస్‌ఎస్.బేబిరాణి, కె.రాజేశ్వరి పాల్గొన్నారు.

భీమవరంలో ధర్నా నిర్వహిస్తున్న సిఐటియు నేతలు అంగన్‌వాడీలు

పెనుమంట్ర: అంగన్‌వాడీల నిర్బంధం అప్రజాస్వామికమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. విజయవాడలో జరిగే మహాధర్నాకు వెళ్లకుండా అంగన్‌వాడీలను పోలీస్‌స్టేషన్‌లో సోమావరం నిర్బంధించారు. వారిని గోపాలన్ పరామర్శించి మాట్లాడారు.

ఆచంట : మహిళలని చూడకుండా పోలీసులు అంగన్‌వాడీ కార్యకర్తల పట్ల అమానుషంగా ప్రవర్తిస్తున్నారని సిఐటియు మండల కార్యదర్శి వద్దిపర్తి అంజిబాబు అన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విజయవాడ వెళ్తున్న కార్యకర్తను చేబ్రోలు ఎస్ఐ స్వామి అరెస్టు చేసి ఆచంట పోలీసులకు సమాచారం అందించారు. ఈ నేపథ్యంలో ఆచంట పోలీసులు అక్కడికి వెళ్లి కార్యకర్తలను రెండు వ్యాన్లతో ఆచంట పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడారు. అరెస్టు చేసిన కార్యకర్తలను సిపిఎం నాయకులు తలుపూరి బుల్లబ్బాయి, తోటపల్లి సత్యనారాయణ, పి.మోహన్‌రావు పరామర్శించి వారికి కూల్ డ్రింక్స్, బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. అరెస్టయిన వారిలో బి.కమల, బి.శ్రీదేవి, జి.సుష్మ, కె.నాగమణి, లక్ష్మీదుర్గ, ఇందిర, శ్రీలక్ష్మి ఉన్నారు.

తాడేపల్లిగూడెంలో..

తాడేపల్లిగూడెం : అంగన్‌వాడీ కార్యకర్తల అక్రమ అరెస్టులను నిరసిస్తూ సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు జవ్వాది శ్రీను హాజరై మాట్లాడారు. విజయవాడ వెళ్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలను తాడేపల్లిగూడెం రైల్వేస్టేషన్ వద్ద పోలీసులు నిర్బంధించి అరెస్టు చేసి గూడెం పోలీస్ స్టేషన్‌కు తరలించడం దారుణమన్నారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మడక రాజు, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు సిహెచ్ శ్రీదేవి, విజయలక్ష్మి, రాణి, అరుణ పాల్గొన్నారు.

తణుకు రూరల్ : జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయమంటే అక్రమ అరెస్టులు, గృహ నిర్బంధం చేయడం సిగ్గుచేటని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ విమర్శించారు. సోమవారం ఛలో విజయవాడ వెళ్తున్న వారిని అడ్డుకోవడాన్ని నిరసిస్తూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ అంగన్‌వాడీల ఓట్లు దండుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు వారికి ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయరని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు పిఎల్.నర్సింహారావు, పట్టణ అధ్యక్షులు ఎన్.ఆదినారాయణబాబు, గార రంగారావు, వెంకటేశ్వరరావు, అనంతలక్ష్మి, కేశవ, జ్యోతిబాబు, రమేష్ పాల్గొన్నారు.

పోడూరు : ముందస్తు అరెస్టులు ఆపాలని సిఐటియు జిల్లా కౌన్సిల్ సభ్యులు పిల్లి.ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రకటన విడుదల చేసిన వారిలో సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు బి.వెంకట్రావు, బెల్లాన్ని ప్రకాశరావు, కెవిపిఎస్ మండల కార్యదర్శి కాకర వెంకటేశ్వర్లు ఉన్నారు.

పాలకొల్లు : తమ న్యాయమైన కోర్కెల సాధన కోసం విజయవాడలో శాంతియుతంగా ధర్నా చేయడానికి బయలు దేరిన అంగన్‌వాడీ కార్యకర్తలను పట్టణ పోలీసులు దౌర్జన్యంగా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కొందరికి ముందుగా నోటీసులు ఇవ్వడం, మరికొందరిని విజయవాడ వెళ్లకుండా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తమతో ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయించుకుంటోందని పొట్నూరి పద్మావతి విమర్శించారు. ఈ ఆందోళనలో జి.ధనలక్ష్మి సిహెచ్.సుజాత, డి.పెద్దింట్లు, బండి పద్మావతి, ఎన్.శ్రీదేవి పాల్గొన్నారు. సిఐ రాంబాబు ఆధ్వర్యంలో పోలీసులు ఆందోళనకారులను స్టేషన్‌కు తరలించారు. కోనసీమ జిల్లాలోని రావులపాలెం, జగ్గన్నపేటకు చెందిన కార్యకర్తలు నరసాపురం - విజయవాడ ఫాస్ట్ పాసింజర్‌కు వెళుతుండగా రైల్వే స్టేషన్‌లో అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

అంగన్‌వాడీల నిర్బంధం అన్యాయం
సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - భీమవరం

అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లను అరెస్టులు చేసి నిర్బంధించడం అన్యాయమని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శాంతియుతంగా విజయవాడ ధర్నాకు వెళుతున్న అంగన్‌వాడీలను మహిళలని చూడకుండా నిర్బంధించడం అన్యాయమని పేర్కొన్నారు. భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం, పాలకొల్లు, మొగల్తూరు, ఆకివీడు, వీరవాసరం ఇలా జిల్లాలో పలుచోట్ల అరెస్టులు చేసి పోలీస్‌స్టేషన్లలో నిర్బంధించడం దారుణమని తెలిపారు. విజయవాడ మార్గమధ్యంలో ఉన్నవారిని, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో అరెస్టులు చేసి కళ్యాణ మండపాల్లో నిర్బంధించడం సిగ్గుచేటని పేర్కొన్నారు. అంగన్‌వాడీల న్యాయమైన కోర్కెలకు అందరూ మద్దతు తెలపాలని, ప్రభుత్వ నిర్బంధాన్ని ఖండించాలని బలరాం విజ్ఞప్తిచేశారు.

వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రతి సమస్యనూ పరిష్కరించాలి
జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

స్పందనలో వచ్చిన ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలలా ప్రజల నుంచి వచ్చిన 264 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించే విధంగా జిల్లా, మండల స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. స్పందనలో అందిన అర్జీలను రీఓపెన్ కాకుండా స్పష్టతతో పరిష్కరించాలని సూచించారు. సమస్యను పరిష్కరించేటప్పుడు ఫిర్యాదుదారునితో మాట్లాడుతున్న ఫొటో అప్‌లోడ్ చేయాలని, సమస్య పరిష్కారం కాకముందు ఉన్న ఫొటో, పరిష్కారం అయిన తర్వాత ఫొటోలు పంపాలని తెలిపారు. అప్‌లోడ్ చేయని దరఖాస్తు పరిష్కారం కానట్లుగా పరిగణించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, జిల్లా పంచాయతీ శాఖ అధికారి జివికె మల్లికార్జునరావు, గృహ నిర్మాణ శాఖ పీడీ ఆర్‌సి ఆనందకుమార్, డిఎస్‌పి బి.శ్రీనాథ్ పాల్గొన్నారు.

ఒపిఎస్ అమలు చేయాలి
కలెక్టరేట్ వద్ద ఫ్యాప్టో నిరసన

ప్రజాశక్తి - భీమవరం

క్యాబినెట్ ఆమోదించిన జిపిఎస్ బిల్లుకు వ్యతిరేకిస్తూ జిల్లా ఫ్యాప్టో ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ నిరసనకు జిల్లా నలుమూలల నుంచి సుమారు 500 మంది ఉపాధ్యాయులు తరలివచ్చారు. కలెక్టరేట్ ప్రాంగణంలో నేలపై బైఠాయించి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో ఛైర్మన్ జవహర్ రాజు మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం జిపిఎస్ రద్దుచేసి ఒపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిస్.విజయరామరాజు మాట్లాడుతూ జిపిఎస్ డ్రాప్‌ను విడుదల చేయకుండా, బిల్లును క్యాబినెట్లో ఎలా ఆమోదిస్తారని ప్రశ్నించారు. ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు అత్యంత దారుణంగా ఉన్నాయని విమర్శించారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ప్రకాశం, జిల్లా కన్వీనర్ రమణ మాట్లాడుతూ ఒపిఎస్‌ను ఆమోదించి సిపిఎస్ ఉద్యోగుల్లో ప్రభుత్వం చీకటి నింపిందన్నారు. సిక్కిం, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో ఒపిఎస్ వైపు అడుగులు వేస్తున్నారన్నారు. ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు రామచంద్రరావు మాట్లాడుతూ జిపిఎస్‌పై ప్రభుత్వ నిర్ణయం ఇలాగే కొనసాగితే ప్రభుత్వం తగు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రశాంతికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామభద్రం, బిటిఎ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వరరావు, మధు, ఎపిసిపిఎస్ఎ నాయకులు వెంకటేశ్వరరావు, రాంబాబు పాల్గొన్నారు.

యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు విజయరామరాజు

మహిళలకు భద్రత కల్పించాలి
ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పద్మజ, పూర్ణ

ప్రజాశక్తి - భీమవరం

మహిళలపై దాడులు, అత్యాచారాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో మహిళలకు రక్షణ కల్పించాలని ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.పద్మజ, పుగాకు పూర్ణ అన్నారు. భీమవరం కలెక్టరేట్లో డిఆర్ఒ కృష్ణవేణికి సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో కన్నతండ్రి కూతురిని దారుణంగా హింసించి చంపాడని తెలిపారు. మద్యానికి బానిసై ఇలాంటి దుర్మార్గాలు పెరుగుతున్నాయిని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో చాలా ఘటనలు జరిగాయని, బాధిత మహిళలకు రక్షణ, భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి దొరక్క, అప్పులు తీర్చుకునేందుకు భద్రత లేని ప్రయాణాలతో, వలసలతో నామమాత్రమైన వేతనాలతో పని చేస్తున్నారని చెప్పారు. కరువు ఉన్న జిల్లాలు, ప్రాంతాల్లో ఉపాధి హామీ కింద పనులు కల్పించాలన్నారు. వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. రేషన్ డిపోల ద్వారా ఇస్తున్న కందిపప్పు, 4 నెలలుగా ఇవ్వడం లేదని పేర్కొన్నారు. మద్యం షాపులు తగ్గించాలని డిమాండ్ చేశారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై అక్టోబర్ 5న ఢిల్లీలో మహాభారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో మహమ్మద్ సరోజిని, హేమలత ఉన్నారు.

డిఆర్ఒకు సమస్యలు వివరిస్తున్న ఐద్వా నేతలు

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి
కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.అజయ్‌కుమారి డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టరేట్ వద్ద కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అజయ కుమారి మాట్లాడుతూ 20 ఏళ్ల నుంచి మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు అందించాలన్నారు. ప్రతి నెలా ఐదో తేదీలోపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు అందించాలన్నారు. మార్కెట్లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా బడ్జెట్ పెంచాలని, కనీసం మెనూ ప్రకారం రూ.20 పెంచాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, వంట చేసేటప్పుడు అగ్ని ప్రమాదానికి గురైన వారికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, వంట పాత్రలు ప్రభుత్వమే ఇవ్వాలని, ఏడాదికి రెండు జతలు యూనిఫారం ఇవ్వాలని కోరారు. ఈ పథకాన్ని ప్రయివేటు సంస్థలకు అప్పగించకూడదని, రాజకీయ వేధింపులు ఆపాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాగమణి, ఎస్తేరు రాణి, సుభద్ర, భూలక్ష్మి, వరలక్ష్మి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

డాక్టర్ నిర్లక్ష్యం వల్లే శిశు మరణం
వైద్యాధికారిని సస్పెండ్ చేయాలని సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - పెనుగొండ

శిశుమరణాలకు కారణమైన పెనుగొండ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ విజయలక్ష్మిని విధుల నుంచి సస్పెండ్ చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ ఎన్.గురుమూర్తి రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకుడు ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పెనుగొండ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ విజయలక్ష్మి వచ్చిన తర్వాత ఇద్దరు గర్భిణులు తమ బిడ్డలను కోల్పోయారని తెలిపారు. డాక్టర్ ఉదయం 11 గంటలకు ఆసుపత్రికి వచ్చి మధ్యాహ్నం రెండు గంటల వరకూ మాత్రమే విధులు నిర్వహిస్తారని తెలిపారు. ఆమె ప్రతిరోజు తాడేపల్లిగూడెం నుండి వచ్చి పెనుగొండలో ఉద్యోగం చేస్తారని తెలిపారు. ఆమె వెళ్లిన తర్వాత ఆసుపత్రికి వచ్చిన గర్భిణులకు వైద్యం సరిగ్గా అందక కేవలం నర్సులపై ఆధారపడి పరిమితమైన వైద్య సౌకర్యాలు అందుతున్నాయని తెలిపారు. పెనుగొండ బాపూజీపురం ప్రాంతానికి చెందిన గర్భిణి డెలివరీ కాక గర్భంలోనే బిడ్డను కోల్పోయిందని, ఈనెల 19న చినమలం గ్రామానికి చెందిన గర్భిణి మామిడిశెట్టి జ్యోతి డాక్టర్ నిర్లక్ష్యం కారణంగా బిడ్డను కోల్పోయిందని తెలిపారు. తక్షణం డాక్టర్ విజయలక్ష్మిని సస్పెండ్ చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గుర్రాల సత్యనారాయణ, నాగిశెట్టి గంగారావు, నీలాపు ఆదినారాయణ, మాదాసు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తహశీల్దార్ గురుమూర్తిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నేతలు

దళిత కుటుంబాలకు భూ పంపిణీ చేయాలి
కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బలరాం డిమాండ్ - జిల్లాలో ముగిసిన దళిత రక్షణ యాత్ర

ప్రజాశక్తి - పాలకోడేరు

భూ పంపిణీతోనే దళితుల అభివృద్ధి సాధ్యమని, ప్రతి కుటుంబానికీ భూమి పంపిణీ చేయాలని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బి.బలరాం అన్నారు. కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన దళిత రక్షణ యాత్ర ఆదివారం రాత్రి పాలకోడేరు మండలం విస్సాకోడేరులో ముగిసింది. దళితుల ఆత్మగౌరవం, సంక్షేమం, ఉపాధి, సామాజిక న్యాయం సాధనకై జిల్లా వ్యాప్తంగా 20 మండలాలు, 6 పట్టణాల మీదుగా యాత్ర కొనసాగింది. యాత్ర ముగింపులో భాగంగా విస్సాకోడేరు ఫోర్ నంబర్ పేటలో జరిగిన సభకు హాజరైన బి.బలరాం మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా సామాజిక న్యాయానికి తూట్లు పొడుస్తోందన్నారు. స్వాతంత్రం వచ్చి 76 ఏళ్లు పూర్తయినా నేటికీ దళితులు, దళిత పేటలు అభివృద్ధి కాకపోవడం పాలకులు సిగ్గుపడాలన్నారు. నేటికీ దళితపేటలో మౌలిక సదుపాయాలు కరువవుతున్నాయన్నారు. పేటల అభివృద్ధి కోసం పోరాడి సాధించుకున్న ఎస్‌సి, ఎస్‌టి, సబ్‌ప్లాన్ చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయాలని డిమాండ్‌చేశారు. 2005లో వామపక్షాల కృషితో దేశవ్యాప్తంగా సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. ప్రతి పేద దళిత కుటుంబానికీ వంద రోజులు పని కల్పించాలని చట్టం చెబుతుంటే నిబంధనలకు విరుద్ధంగా పాలకులు ఉపాధి హామీకి తూట్లు పొడుస్తున్నారన్నారు. దళితులు, పేద, బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాంగబద్ధంగా ఇచ్చిన హక్కులను స్వేచ్ఛను హరించి నిరంకుశత్వ, నియంతృత్వ పాలనను మోడీ సాగిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుల వివక్షను అంతం చేసేందుకు తీసుకొచ్చిన రిజర్వేషన్లను రద్దు చేయాలనే ఉద్దేశంతో మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో మిగులు భూములు లక్షల్లో ఉన్నాయని, వాటిని కోనేరు రంగారావు సిఫార్సుల ప్రకారం ప్రతి దళిత కుటుంబానికీ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. దళితులు చనిపోతే పూడ్చి పెట్టడానికి శ్మశానవాటిక కూడా లేని దయనీయ పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. జిఒ 1235 ప్రకారం ప్రతి దళిత పేటకూ రెండెకరాల భూమిని శ్మశానవాటికకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా దళితుల సామాజిక న్యాయం సాధనకై ఈనెల 29న విజయవాడలో మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బత్తుల విజయకుమార్, కె.క్రాంతిబాబు, వ్యకాస జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ, మహిళా కన్వీనర్ జక్కంశెట్టి వెంకటలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు బల్ల చిన్న వీరభద్రం, శేషపు అశ్రియ్య, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చైతన్యప్రసాద్, షేక్ వలీ, కళాకారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బలరాం

నూతన ట్రస్ట్ బోర్డు ప్రమాణస్వీకారం

ఛైర్మన్‌గా గుర్రం హరినాథ్

ప్రజాశక్తి - ఆకివీడు

యాత్రికుల మనోభీష్టం మేరకు పాలకవర్గం కార్యక్రమాలు నిర్వహించాలని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు తెలిపారు. స్థానిక భీమేశ్వరస్వామి దేవస్థానం నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారం సోమవారం దేవాలయ ప్రాంగణంలో జరిగింది. దేవస్థాన కార్యనిర్వహణాధికారి నాగరాజు ట్రస్ట్ బోర్డు సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో నరసింహరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గుర్రం హరినాథ్ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్‌గా కంభంపాటి నరసింహ, చొప్పర్ల మణికంఠ, మరో ముగ్గురు సభ్యులు, ఎక్స్ అఫీషియో ఇద్దరితో సహ ఎనిమిది మంది సభ్యులతో కలిసి నూతన పాలకవర్గం ఏర్పడింది. నూతన పాలకవర్గాన్ని పలువురు అభినందించారు.

మధుర గాయకులు బాలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మధుర గాయకుడు, సినీ జగత్తులో ధ్రువతార ఎస్‌పి బాల సుబ్రహ్మణ్యం అని, యుగాంతం వరకూ ఎస్పీ బాలు పాటలు నిలిచిపోయాయని పలువురు కళాకారులు అన్నారు. స్థానిక వెంకట్రామ థియేటర్ కాన్ఫరెన్స్ హాల్లో ఎస్‌పి బాలు వర్ధంతిని నిర్వహించారు. కళారంజని అధ్యక్షులు జవ్వాది శ్రీనివాస్, రామరాజు భూషణ పరిషత్ కార్యదర్శి మల్లికార్జున్, చైతన్య భారతి నాటక పరిషత్ సభ్యులు భట్టిప్రోలు శ్రీనివాసరావు, వట్టి కళాకారుల సంఘం కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ తన గళంతో ప్రపంచంలో భారత దేశ ఖ్యాతిని ఇనుమడింపజేశారని తెలిపారు. భీమవరం చైతన్య భారతి నాటిక పరిషత్ బాలును సత్కరించిందని తెలిపారు.

శాశ్వత అన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - కాళ్ల

సీసలిలో షిరిడీ సాయిబాబా ఆలయ శాశ్వత అన్నదానానికి కాళ్లకూరు గ్రామానికి చెందిన కందుల వెంకట సత్యనారాయణ - సులోచన దంపతులు రూ.లక్ష విరాళం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్‌పర్సన్ తోరం అనంతలక్ష్మి సత్యవతిదేవి ఆమె కుటుంబ సభ్యులను సత్కరించారు.

నీట మునిగిన రహదారుల పరిశీలన

ప్రజాశక్తి - పోడూరు

మట్టపర్రు గ్రామంలో పాలకొల్లు వైసిపి ఇన్‌ఛార్జి గుడాల గోపి జగనన్న కాలనీలో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలో నీట మునిగిన రహదారులను పరిశీలించి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట వైస్ ఎంపిపి గుబ్బల సత్యనారాయణ, గ్రామ అధ్యక్షులు కొలుకుల రవిబాబు, కుసుమ సుధాకర్, బల్ల.రాజశేఖర్ పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నిర్మూలన

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని అన్ని గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో సోమవారం సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని మండల వ్యవసాయ శాఖ అధికారి బి.సంధ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. సోమవారం ఎలుకలు నివసించే అన్ని బొరియలను మట్టితో పూడ్చి వాటిని గుర్తించేందుకు వీలుగా గుర్తులు పెట్టాలని ఆమె సూచించారు. రెండో రోజు ముందు రోజు పూడ్చిన బొరియలను గుర్తించి అవి తెరిచి ఉంటే వాటిలో ఎలుకలు ఉన్నాయని నిర్ధారించుకుని రాష్ట్ర ప్రభుత్వం చే ఉచితంగా పంపిణీ చేసే బ్రోమాడియోలిన్ మందును చిన్న చిన్న పొట్లాలుగా చేసి తెరిచిన బొరియలలో ఉంచి మరలా మట్టితో పూడ్చడం ద్వారా ఎలుకల ఉధృతిని నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరు సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఈనెల 26వ తేదీన విద్యుత్ నిలిపివేయనున్నట్లు నరసాపురం ఎలక్ట్రికల్ డిఇఇ బి.సురేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్టేరు 33/11 కెవి సబ్‌స్టేషన్ పరిధిలోని నెలమూరు ఫీడర్ డ్యామేజ్ పోల్స్, డ్యామేజ్ కండక్టర్ మార్చనున్న నేపథ్యంలో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ సత్యవరం, కోయేటిపాడు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

పడాలలో జనసేన పల్లెపోరు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెంకు మూడు కిలోమీటర్ల దూరంలో నడిబొడ్డున ఆనుకొని ఉన్న పడాల గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థను ఈ నాలుగు సంవత్సరాలు వైసిపి ప్రభుత్వం పట్టించుకోలేదని జనసేన తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. సోమవారం జనసేన పల్లె పోరులో భాగంగా పడాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి సమస్య ఇక్కడ ప్రజలకు శాపంగా మారిందన్నారు. ప్రభుత్వం మాత్రం గ్రామ సచివాలయ వ్యవస్థను చూసుకొని సర్పంచులను పక్కనపెట్టేసిందన్నారు. పంచాయతీల్లో నిధులు లేవని అందుకే పనులు చేపట్టలేకపోతున్నామని సర్పంచులు గగ్గోలు పెడుతున్నారన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, రోడ్లు మరమ్మతులు వంటి అవసరాల కోసం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇతర పథకాలకు మళ్ళించడంపై ప్రజలు మండిపడుతున్నరని తెలిపారు. ఇప్పటికైనా పంచాయతీ నిధులు కేటాయించకపోతే వచ్చే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం ప్రజల్లో తిరిగే పరిస్థితి ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు అడపా ప్రసాద్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ పునరుద్ధరించాలని వినతి

ప్రజాశక్తి - పెనుమంట్ర

పొలమూరు పంచాయతీ నిర్వహణలో ఉన్న వాటర్ ప్లాంట్‌ను పునరుద్ధరించాలని సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో సోమవారం గ్రామ సర్పంచి కాకర రాజేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం శాఖ కార్యదర్శి రాపాక ఆశీర్వాదం మాట్లాడుతూ చాలాకాలం నుంచి వాటర్ ప్లాంట్ మూసివేయడంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వాటర్ ప్లాంట్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సర్పంచి రాజేశ్వరరావు మాట్లాడుతూ త్వరలోనే వాటర్ ప్లాంట్ పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్, చింతపల్లి తిరుమలరావు, కముజు ప్రసాద్, కె.పద్మజ, కె.రాజారాం, బి.జార్జి, ప్రదీప్ పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - తణుకు రూరల్

జాతీయ సేవా పథకం ద్వారా యువతలో సామాజిక చైతన్యం, నాయకత్వ లక్షణాలు ఏర్పడతాయని ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల డిగ్రీ, పీజీ(అటానమస్) ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) ఆవిర్భావ దినోత్సం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ జి.రమ్య, సిహెచ్.రమేష్‌బాబు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కాళ్లలో అన్నసమారాధన

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్ల గ్రామంలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా సోమవారం దాతల సహకారంతో అన్నసమారాధన నిర్వహించారు. పాత సినిమా హాలు సెంటర్‌లో 24వ సంవత్సరాల నుంచి ప్రతి ఏడాది వరసిద్ధి వినాయక ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా సోమవారం అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నాగరాజు, జనసేన కాళ్ల మండల అధ్యక్షులు ఎరుబండి రామాంజనేయులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు బండారు సీతారామాంజనేయులు, నిమ్మల హేమసాయి, కోడేటి సాయి తరుణ్, కొప్పినేడి శివ, కేసిరెడ్డి రేవంత్, కోలా గణేష్, నిమ్మల శివమణి, యాతం సాయి, నిమ్మల వర్ధన్, బండారు అజయ్, యాతం మణికంఠ, కొల్లి మణికంఠ, కంభంపాటి సాయి పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో గుడాల గోపీ పర్యటన

పాలకొల్లు : పట్టణంలోని 27, 28 వార్డు ఆశ్రమం రోడ్డులో వర్షం ముంపునకు గురవుతున్న డ్రెయినేజీ, రోడ్లను వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సమస్యను ఇంజినీర్ల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయనతో పాటు 27వ వార్డు ఇన్‌ఛార్జి పండుబాబు, 28వ వార్డు ఇన్‌ఛార్జి శీలం సూరిబాబు, పెద్ద గోపురం ఛైర్మన్ కోరాడ శ్రీనివాసరావు ఉన్నారు.

ప్రజాశక్తి – ప్రతి అక్షరం - ప్రజల పక్షం

పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి

ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190

పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం..!

మురుగు, దోమలతో స్థానికుల అవస్థలు

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. చిన్నపాటి వర్షానికి పలు ప్రాంతాల్లో మురుగు నీరు రోడ్లపై చేరి అధ్వానంగా మారుతున్నాయి. దీంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కొద్ది నెలలుగా రోడ్లపై మురుగు, వర్షపు నీరు నిల్వ ఉండిపోయింది. దీంతో దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు దుర్వాసన భరించలేకపోతున్నామని వాపోతున్నారు. అలాగే ప్రధాన రహదారిలో వర్షపు నీరు నిలిచి పోతోందని, మురుగునీరు సైతం ప్రవహించక ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో దోమలకు ఆవాస కేంద్రంగా మారుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి డ్రెయినేజీ వ్యవస్థను బాగు చేసి శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులు కోరుతున్నారు.

కాళ్లలో రోడ్డుపై డ్రెయినేజీ నీరు

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి : కలెక్టర్

ప్రజాశక్తి - ఉండి

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. సోమవారం మహదేవపట్టణంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష పైలెట్ క్యాంపును నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ప్రశాంతి క్యాంపును సందర్శించి అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఈనెల 30వ తేదీన ముఖ్యమంత్రి చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభం కానుంది. ప్రారంభం నాటికంటే ముందుగా ప్రతి జిల్లాలోని రెండు మండలాల్లో పైలెట్ క్యాంపులను నిర్వహించాల్సిందిగా ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదేశించారు. దీనిలో భాగంగా తొలి పైలెట్ క్యాంపును మహదేవపట్నంలో సోమవారం నిర్వహించారు. తొలుత ఎఎన్‌ఎంలు చేసిన ఇంటింటి సర్వే పరీక్షల రిపోర్టు ఆధారంగా పైలెట్ క్యాంపులో ఒక గైనకాలజిస్ట్, ఒక జనరల్ ఫిజీషియన్, ఒక చిన్న పిల్లల వైద్య నిపుణులు పాల్గొని అనారోగ్యంగా ఉన్న వారిని పరీక్షించి తగిన మందులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య రక్షణకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌ఒ మహేశ్వరరావు, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టరు ఎస్.కీర్తి, అదనపు డిఎంహెచ్‌ఒ బి.భాను నాయక్, ఎంపిడిఒ ఎవి.అప్పారావు, సిడిపిఒ వాణీ విజయరత్నం పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పైలెట్ క్యాంపులో మాట్లాడుతున్న కలెక్టర్

గోడౌన్ల నిర్మాణానికి స్థల సేకరణ : కలెక్టర్

భీమవరం :మల్టీపర్పస్ గోడౌన్ల నిర్మాణాలకు అవసరమైన స్థల సేకరణ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎంపిఎఫ్‌సి గోడౌన్‌కు స్థల సేకరణ, రీసర్వే, ఎలక్షన్, హౌసింగ్, జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమం, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు తదితర అంశాలపై సంబంధిత డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సమీక్షలో కలెక్టర్ అంశాల వారీగా డివిజన్, మండల స్థాయి అధికారులను ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. అంశాలవారీగా తహశీల్దార్లు, ఎంపిడిఒలకు, పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు, హార్టికల్చర్ అధికారి ఎ.దుర్గేష్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డి.మహేశ్వరరావు, సిపిఒ శ్రీనివాసరావు, డిసిఒ ఎం.రవికుమార్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కె.మురళీకృష్ణ పాల్గొన్నారు.

మహిళకు గ్రైండర్ అందజేత

ఆచంట :ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి జనసేన ఎల్లవేళలా కృషి చేస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షులు జవ్వాది బాలాజీ శ్రీనివాస్ అన్నారు. ఆచంట గ్రామంలో శుక్రవారం మార్కెట్‌కు వెళ్లే దారిలో ఉన్న రామాలయం ఎదురు వీధిలో నివసిస్తున్న వితంతు మహిళ సూర్యకుమారి ఉపాధి నిమిత్తం పిండి రుబ్బుకుని అమ్మగా వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటోంది. ఇటీవల మిషన్ పాడవ డంతో ఆమె ఉపాధి కోల్పోవడంతో జనసేన నాయకులు నూతన గ్రైండర్ ను ఆమెకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆచంట, టౌన్ ప్రెసిడెంట్ విజయ్, వైస్ ఎంపిపి నాగరాజు, ఎంపిటిసి దాస్‌రెడ్డి పుణ్యవతి పాల్గొన్నారు.

కొబ్బరి రైతుల ధర్నా జయప్రదానికి పిలుపు

భీమవరం : కొబ్బరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 26వ తేదీ మంగళవారం నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాకు జిల్లా నలుమూలల నుంచి కొబ్బరి రైతులు పెద్దఎత్తున తరలి రావాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరేరామ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విదేశీ కొబ్బరి ఉత్పత్తుల దిగుమతులు ఆపాలని కోరారు. నా ఫెడ్, ఆయిల్ ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ఆయిల్ ఫెడ్ కమిషనర్ ప్రకటించడం హర్షనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర మిల్లింగ్ కొబ్బరికి క్వింటాలుకు రూ.10,860, బంతి కొబ్బరకు క్వింటాలుకు రూ.11,750 రైతుకు ఏమాత్రం గిట్టుబాటు కాదన్నారు. ఈ కేంద్రాలు వ్యాపారులకు ఉపయోగం తప్ప రైతుకు ఏమాత్రం ప్రయోజనకరం కాదన్నారు. కొబ్బరి నూటికి రూ.1500 ధర ఇచ్చి రైతుల నుంచి కొబ్బరికాయలు సేకరణ చేసే విధంగా కొనుగోలు నిబంధనలు మార్చాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని ధరల స్థిరీకరణ నిధి పథకం వర్తింపచేసి కొబ్బరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కొబ్బరి రైతుల సమస్యల పరిష్కారానికి రైతులందరూ సంఘటితం కావాలని కోరారు.

అండర్-14, 17 బాల, బాలికల జిల్లా జట్ల ఎంపిక

వీరవాసరం :ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఆధ్వర్యంలో 2023-24 సంవత్సరానికి సంబంధించి అండర్-14, అండర్-17 బాల బాలికల జిల్లా జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఆర్‌వి.రమణ, పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు స్కూల్ గేమ్స్ కార్యదర్శులు పిఎస్‌ఎన్.మల్లేశ్వరావు, డిబి.రాంజేద్రప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 నుంచి 29 వరకు వివిధ పాఠశాలల్లో ఈ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 26న ఎస్‌సిబిఆర్ హైస్కూల్ భీమవరంలో రోప్‌స్కిప్పింగ్, మల్కాంబ్, యోగా, టేబుల్ టెన్నిస్, 27న శృంగవృక్షం జెడ్‌పి హైస్కూల్‌లో హాకీ, వీరవాసరం జెడ్‌పి హైస్కూల్‌లో బాస్కెట్ బాల్, 29న భారతీయ విద్యాభవన్స్ తాడేపల్లిగూడెంలో అథ్లెటిక్స్, ఎస్‌కెఎస్‌డి తణుకులో షటిల్ బాడ్మింటన్, తణుకు మున్సిపల్ స్కేటింగ్ పార్క్‌లో రోల్ బాల్ జట్లు ఎంపిక నిర్వహిస్తున్నారని తెలిపారు.

రైల్వే పోలీసులకు సత్కారం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

దేశంలో పోలీసు వ్యవస్థ చాలా ప్రతిష్టమైందని, ముఖ్యంగా రైల్వే పోలీసు సేవలు వర్ణనాతీతమని, ప్రయాణికుల భద్రత రక్షణ కోసం 24 గంటల సేవల్లో ఆర్‌పిఎఫ్ ఒకటని రైల్వే అసిస్టెంట్ డివిజన్ ఇంజినీర్ అందే రామాంజనేయులు అన్నారు. స్థానిక టౌన్ రైల్వేస్టేషన్‌లో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ వ్యవస్థాపక దినోత్సవంలో పది మంది రైల్వే పోలీసులను సత్కరించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ ఆర్‌పిఎఫ్‌కు ఒక ప్రత్యేక చట్టం ఉందని చెప్పారు. భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ సిఐ కె.దస్తగిరి మాట్లాడుతూ రైళ్లలో, ఫ్లాట్ ఫాంపై చోరీలు జరిగితే 139కు ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 1985 నుంచి ఆర్‌పిఎఫ్ ప్రయాణికులకు మెరుగైన సేవలను అందిస్తుందన్నారు. అనంతరం రైల్వే సిఐ దస్తగిరి, ఎస్ఐ ఎంపిఆర్.చౌదరి, ఎఎస్ఐ ఎన్.వెంకటేశ్వర్లు, నరసాపురం ఎఎస్ఐ లక్ష్మణ్‌నాయక్, కానిస్టేబుల్స్ ఎస్‌వి.రమణ, ఎం.సాహెబ్, ఎం.ఏడుకొండలు, పి.అంకయ్యలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది రమేష్‌నాయుడు, అరసవల్లి సుబ్రహ్మణ్యం, గంటా సుందర్‌కుమార్, భవన్స్ ఎన్‌సిసి ఆఫీసర్ శేఖర్, ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు.

మోహన్‌కు పలువురి అభినందన

ప్రజాశక్తి - ఆచంట

దుబాయ్‌లో ఉంటున్న మండలంలోని కొడమంచిలి గ్రామానికి చెందిన వైసిపి యూత్ నాయకులు తరపట్ల మోహన్ వైఎస్‌ఆర్ ప్రవాసాంధ్ర టీం తరపున సోషల్ మీడియాలో పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి దుబాయిలో సోషల్ మీడియా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో తరపట్ల మోహన్ వైసిపి సోషల్ మీడియా ద్వారా చేస్తున్న పలు సేవా కార్యక్రమాలకు అప్రిసి యాషన్ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎన్‌ఆర్ఐ ప్రభుత్వ సలహాదారులు సత్తి ప్రసన్న సోమిరెడ్డి, యుఎఇ కో-ఆర్డినేటర్ అక్రమ్ ఆధ్వర్యంలో ఎపి సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ సజ్జల భార్గవ్, మేడపాటి వెంకట్, చల్లా మధుసూదన్‌రెడ్డి, డైరెక్టర్ అక్రమ్‌లు మోహన్‌కు అవార్డు అందించారు. ఆయనకు అవార్డు రావడం పట్ల ఎఎంసి మాజీ ఛైర్మన్ సుంకర ఇందిరా, మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్, ఆచంట సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావు, ఉప సర్పంచి ములగాడ వరప్రసాద్, సొసైటీ అధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణ, ఎంపిటిసి సభ్యులు చిలుకూరి భవానినరేంద్ర, ఎల్లమెల్లి బేబీరాజేష్, నాయకులు సాకా సురేష్, పుచ్చకాయల నాగార్జున, చల్లా సుభాకరరావు అభినందించారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రాల ఎత్తివేత సరికాదు

ప్రజాశక్తి - పాలకొల్లు

విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రాలు ఎత్తివేయడం సరికాదని సిపిఎం పట్టణ కార్యదర్శి జవ్వాది శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో చల్లా సోమేశ్వరరావు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన కసమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.వేలల్లో విద్యుత్ బిల్లులు వస్తుంటే మీ సేవా సర్వీస్ ఛార్జ్ అదనపు భారం అవుతుందన్నారు. ఇప్పటికే ట్రూ అప్, కస్టమర్, సర్వీస్ ఛార్జ్ పేరుతో పన్నులు చెల్లిస్తుంటే మరింత భారం వినియోగదారులపై పడే విధంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. చెల్లింపు కేంద్రాల ఎత్తివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సీనియర్ నేత పురుషోత్తం పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టుపై టిడిపి నేతల నిరసన

ప్రజాశక్తి - భీమవరం రూరల్

చంద్రబాబు అరెస్టుపై నిరసనగా భీమవరంలో టిడిపి చేపట్టిన నిరాహార దీక్షలు సోమవారంతో 16వ రోజుకు చేరుకున్నాయి. నందమూరి తారక రామారావు మనవడు యశ్వంత్ నిమ్మరసం ఇచ్చి నిరాహార దీక్షలను విరమింప చేశారు.

పాలకొల్లు : చంద్రబాబు అరెస్టుపై నిరసనగా పాలకొల్లులో గాంధీ బొమ్మ సెంటర్ వద్ద చేపట్టిన దీక్షల్లో సోమవారం 13వ రోజు చేనేత కార్మికులు పాల్గొన్నారు. ఎంపిటిసి మాజీ సభ్యులు అందేకోటి వీరభద్రరావు మాట్లాడారు.

ఉండి : ఉండిలో ఎంఎల్ఎ మంతెన రామరాజు ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలో ఉండి మండలానికి చెందిన టిడిపి నాయకులు, అనుబంధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. వీరికి మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు సంఘీభావం తెలిపి మాట్లాడారు. దీక్షలో కూర్చున్న వారికి కలిదిండి శ్రీనివాసరాజు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపచేశారు.

ఆచంట : చంద్రబాబు అరెస్టు దారుణమని టిడిపి నేత పితాని వెంకట్ అన్నారు. చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా ఆచంటలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 13వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం చంద్రబాబును అక్రమ అరెస్టు చేసి కక్ష పూరిత చర్యలకు ప్రేరేపిస్తుందన్నారు.

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం గొర్రెల సూరన్న కాంప్లెక్స్ వద్ద రిలే నిరాహార దీక్షలను టిడిపి తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల మల్లికార్జునరావు (బాబ్జి) ప్రారంభించారు. చంద్రబాబు అరెస్టుపై నిరసనగా నల్ల బెలూన్లు ఎగురవేశారు. ఈ దీక్షా శిబిరంలో పెంటపాడు, తాడేపల్లిగూడెం మండలాల నాయకులు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ నరసాపురం మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు పోస్టు కార్డు ఉద్యమాన్ని తలపెట్టారు. సోమవారం ఎల్‌బి.చర్ల గ్రామంలో టిడిపి సీనియర్ నాయకులు చీర్ల సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో టిడిపి, జనసేన కుటుంబ సభ్యులు పాల్గొని రాష్ట్రపతి, రాష్ట్ర గవర్నర్లకు వెయ్యి పోస్ట్ కార్డులు తపాలా ద్వారా పంపి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి మాజీ సభ్యులు మంద్రు హేమలత, రాట్నాల నరసింహరావు, కటకంశెట్టి పార్థసారథి పాల్గొన్నారు.

మహారాజశ్రీ తణుకు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి మరియు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వారి కోర్టులో
ఓ.ఎస్. నెం. 68/2023
Between:
కొల్లే సుబ్బలక్ష్మి -వాది
మరియు
కుచ్చర్లపాటి పెద్దిరాజు -ప్రతివాది
ప్రతివాది:
కుచ్చర్లపాటి పెద్దిరాజు, తండ్రి: సీమోను, హిందూ, పురుషుడు, ఇంటి నెంబరు: 4-135/1, కరెంటు ఆఫీసు దగ్గర, యాల్లవాని గరువు, పాలకొల్లు, పాలకొల్లు మండలం.
పై నంబరు దావా నందు ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారాను, రిజిస్టర్ పోస్టు ద్వారాను ఎన్నిమార్లు దావా సమన్లు పంపిననూ మీరు ఉద్దేశ్యపూర్వకంగా అందుకుని యుండుటలేదు. కాబట్టి పై కోర్టు వారి ఎదుట ది. 10-10-2023 ఉదయం గం॥ 10.30 ని॥ల లగాయతు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి పై దావా నందు మీ యొక్క ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు పై నంబరు దావా తీర్మానం చేయబడునని ఇందుమూలముగా తెలియపరచడమైనది.
G.V.V.APPAJI, Advocate
తణుకు వాది తరపు న్యాయవాది
ది.23-9-23 Relangi, Cell: 9948809596

మహారాజశ్రీ తణుకు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్. నెం. 25/2022
బిట్వీన్:
1. పర్వతం జానకి, వగైరాలు -వాద్దు
మరియు
1. పర్వతం సత్యనారాయణ, వగైరాలు -ప్రతివాద్దు
టు:
పర్వతం ఉదయరత్నం, భర్త: సత్యనారాయణ, డోర్ నెం. 1-60, కోనాల గ్రామం, తణుకు మండలం.
-2వ ప్రతివాది
వాది తరపున దాఖలు చేసిన పేపరు ప్రకటన
పై నెంబరు గ్రంధంలో 2వ ప్రతివాది అయిన మీకు దావా సమన్లు శ్రీ కోర్టు ద్వారా మరియు రిజిస్టర్డు పోస్టు ద్వారా పలుమార్లు పంపించిననూ, అవి మీరు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున మీరు పై కోర్టు వారి ఎదుట ది. 04-10-2023వ సం॥రం తేదీన ఉదయం 10.30 గం॥ ని॥లకు హాజరు కావలెను. మీరు స్వయంగా గానీ, మీ తరపు ప్లీడరు గారి ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలియపర్చుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించెదరు అని మీకు పేపరు ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.
ఇవటూరి కిషోర్
తణుకు వాది తరపు అడ్వకేట్
తేది:20-9-2023 సెల్: 9848544550

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, ప॥గో॥జిల్లా, ఏలూరు
O.S. No. 504/2020
Between:
వాదులు:
1. Smt. Medapati Surya Prabhavathi
2. Sri. Medapati Sudhakar Reddy
3. Sri. Medapati Sivaramakrishna Reddy
...Plaintiffs
ప్రతివాదులు:
1. Smt. Makanaboina Lakshmi
2. Vijayalakshmi Constructions, Eluru
Rep. by Pedapudi Jeeva Prakasa Rao.
3. Sri. Pedapudi Jeeva Prakasa Rao
4. Smt. Nalluri Vijayakumari
...Respondents
Makanaboina Lakshmi, W/o. Nageswara Rao, House wife, R/o. D.No. 24A-11-2, Ashok Nagar, Eluru, W.G.Dt.,
ఆర్డరు-5, రూల్-20 సిపిసి ప్రకారం దాఖలు చేసిన పేపరు ప్రకటన పై నెంబరు దావాలో ప్రతివాదులకు సమన్లు ఎన్నిసార్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున సదరు దావా నోటీసు అమలు జరుగనందున ది. 05-10-2023వ తేదీకి కోర్టు వారు వాయిదా వేసినారు. ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు ప్రతివాదులు ప్రత్యక్షంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరు కావలసిందిగాను, లేనియెడల ప్రతివాదులు పరోక్షంలో దావా తీర్మానం కాబడునని తెలియజేయడమైనది.
బి.గౌరీశంకర్
ఏలూరు ఎ.వి.ఎస్.సూర్యారావు, అడ్వకేట్స్
ది.25-9-23 ఏలూరు, ప॥గో॥జిల్లా

దస్తావేజులు పడిపోయినవి
అలిగి కిరణ్, తండ్రి: అలిగి ప్రసాద్ (లేటు). మా తండ్రి గారైన అలిగి ప్రసాద్ (లేటు) గారి పేరు మీద డాక్యుమెంట్ పడిపోయినవి. డాక్యుమెంట్ నెంబర్: 826/2008 గల డాక్యుమెంట్ 10-09-2023న పాలకొల్లు నుండి దొడ్డిపట్ల బైక్‌పై వెళుతుండగా మార్గ మధ్యంలో మా యొక్క డాక్యుమెంట్ పడిపోయినవి. ఎవరికైన దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.
అడ్రస్: అలిగి కిరణ్
తండ్రి: అలిగి ప్రసాద్, వినాయక టెంపుల్ స్ట్రీట్ హౌసింగ్ బోర్డు కాలనీ, పాలకొల్లు ప॥గో॥జిల్లా, సెల్: 9866239380

వేలం ప్రకటన
మహారాజశ్రీ 1st అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి, ఏలూరు వారి కోర్టులో
E.P. 435/2020, O.S. 15/2013
Between:
శ్రీ అల్లూరి శ్రీనివాసరావు ...DHR
AND
శ్రీమతి మునుకొండ జానకి ...JDR
పై నెంబరు గ్రంధములో డిక్రీ బాకీ వసూలు కొరకు JDR యొక్క సంపూర్ణ స్వాధీన హక్కుభుక్తములో ఉన్న ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని ది. 10-10-2023న ఉదయం గం॥ 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట బహిరంగ వేలం వేయబడును. కావున యావన్మంది వేలం పాటలో పాల్గొని పాడుకొనవచ్చును. కోర్టు వారి షరతులు వర్తించును.
షెడ్యూలు ఆస్తి వివరము
ప॥గో॥జిల్లా, అనంతపల్లి సబ్ రిజిష్టరీ, నల్లజర్ల మండలము, నల్లజర్ల గ్రామం యిలాకాలో గల JDR సంపూర్ణ హక్కుభుక్తములలో గల R.S. No. 955/3, R.S. No. 955/3A మరియు R.S. No. 955/3B దాఖలా ఎకరం 1-06 సెంట్లు మెరక భూమి ఈ క్రింది హద్దుల మధ్య:
తూర్పు: అన్నమరెడ్డి లక్ష్మణరావు గారి భూమి.
దక్షిణం: మానుకొండ రామచంద్రరావు గారి భూమి.
పడమర: పుంత
ఉత్తరం: పావులూరి వెంకటేశ్వరరావు గారి భూమి.
ఈ హద్దుల మధ్య ఎకరం 1-06 సెంట్లు మెరక భూమి దానికి గల అన్ని ఈజుమెంటు హక్కులతో సహా వేలం వేయబడును.
DHR విలువ: రూ. 10,00,000/-
అమీనా విలువ: రూ. 22,00,000/-
ఈద్పుగంటి శ్రీనివాసబాబు
కె.రవికుమార్
ఏలూరు అడ్వకేట్స్, ఏలూరు
25-9-23 సెల్: 9491089199

మహారాజశ్రీ పశ్చిమగోదావరి జిల్లా 1వ అదనపు జిల్లా కోర్టు, ఏలూరు
ఐ.ఎ. నెం. 7/2020
ఒ.ఎస్. నెం. 49/2019
భావనా విశ్వనాథ్ -పిటీషనరు/వాది
మరియు
ప్రతివాదులు:
1. శ్రీ చావా రామకృష్ణారావు (డైడ్) మరియు
2. శ్రీమతి యలమంచిలి శేషాయమ్మ వగైరా -రెస్పాండెంట్లు
ప్రపోజ్‌డ్ పార్టీ:
శ్రీ చావా గోకుల్
పై నెంబరు దావాలో 1వ ప్రతివాది చనిపోయినందున వారికి దత్త పుత్రునిగా చెప్పుకొంటున్న శ్రీ చావా గోకుల్ గారిని దావాలో 44వ ప్రతివాదిగా చేర్చమని కోరుతూ వాది పై నెంబరు పిటీషనరు దాఖలు చేసినారు. సదరు పిటీషనులో ఈ క్రింది రెస్పాండెంట్లకు నోటీసు నిమిత్తం ది. 13-10-2023వ తేదీ వాయిదా అయివున్నది.
ఆర్-4: శ్రీమతి చలపాటి భవిత
ఆర్-5: శ్రీ చలపాటి గోపీకృష్ణ దర్శిత్
ఆర్-6: శ్రీ చలపాటి హర్షిత్
ఆర్-7: శ్రీమతి పైనేని ఉమాదేవి
ఆర్-12: శ్రీమతి పెనుమర్తి విజయలక్ష్మి
ఆర్-19: శ్రీ పిచ్చికల సూరిబాబు
ఆర్-22: శ్రీ చావా రామకృష్ణారావు
ఆర్-23: శ్రీ చావా వెంకటేశ్వరరావు
ఆర్-27: శ్రీ చావా సాయిరామకృష్ణారావు
ఆర్-28: శ్రీమతి చావా కిరణ్మయి
ఆర్-31: శ్రీ సత్తి నాగిరెడ్డి
ఆర్-38: శ్రీ ఉప్పల భువన ఆదిత్యకుమార్
ఆర్-39: శ్రీ కొండ్రెడ్డి శ్రీకాంత్
ఆర్-40: శ్రీ చాగంటి కనకదుర్గ
ఆర్-41: శ్రీ శింగవరపు భగత్‌సింగ్
పైన పేర్కొన్న రెస్పాండెంట్లు ది. 13-10-2023వ తేదీ పై కోర్టు వారి ఎదుట ఉదయం గం॥ 10.30 ని॥లకు హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల వారి పరోక్షమున పిటీషను తీర్మానం జరుగునని ఇందుమూలముగా తెలియచేయడమైనది.
ఏలూరు ఎస్.వి.ఆర్.గాంధీ
తేదీ:22-9-2023 వాది తరపున అడ్వకేట్

మహారాజశ్రీ పశ్చిమగోదావరి జిల్లా 1వ అదనపు జిల్లా కోర్టు, ఏలూరు
ఒ.ఎస్. నెం. 49/2019
భావనా విశ్వనాథ్ -వాది
మరియు
1. శ్రీ చావా రామకృష్ణారావు (డైడ్) మరియు
2. శ్రీమతి యలమంచిలి శేషాయమ్మ వగైరా -ప్రతివాదులు
పై నెంబరు దావాను వాది దావా ఆస్తులు పార్టిషను చేయమని కోరుతూ దాఖలు చేసినారు. సదరు దావాలో ఈ క్రింది ప్రతివాదులకు సమన్లు అమలు నిమిత్తం దావా ది. 13-10-2023వ తేదీ వాయిదా అయివున్నది.
డి-4: శ్రీమతి చలపాటి భవిత
డి-5: శ్రీ చలపాటి గోపీకృష్ణ దర్శిత్
డి-6: శ్రీ చలపాటి హర్షిత్
(మైనర్ రిప్రజంటెడ్ బై డి-6 చలపాటి భవిత)
డి-7: శ్రీమతి పైనేని ఉమాదేవి
డి-12: శ్రీమతి పెనుమర్తి విజయలక్ష్మి
డి-19: శ్రీ పిచ్చికల సూరిబాబు
డి-22: శ్రీ చావా రామకృష్ణారావు
డి-23: శ్రీ చావా వెంకటేశ్వరరావు
డి-27: శ్రీ చావా సాయిరామకృష్ణారావు
డి-28: శ్రీమతి చావా కిరణ్మయి
డి-31: శ్రీ సత్తి నాగిరెడ్డి
డి-38: శ్రీ ఉప్పల భువన ఆదిత్యకుమార్
డి-39: శ్రీ కొండ్రెడ్డి శ్రీకాంత్
డి-40: శ్రీ చాగంటి కనకదుర్గ
డి-41: శ్రీ శింగవరపు భగత్‌సింగ్
పైన పేర్కొన్న ప్రతివాదులు ది. 13-10-2023వ తేదీ పై కోర్టు వారి ఎదుట ఉదయం గం॥ 10.30 ని॥లకు హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల వారి పరోక్షమున పిటీషను తీర్మానం జరుగునని ఇందుమూలముగా తెలియచేయడమైనది.
ఏలూరు ఎస్.వి.ఆర్.గాంధీ
తేదీ:22-9-2023 వాది తరపున అడ్వకేట్